# గాలిలో దీపం

“ఓరే పోలిపిల్లీ! అగ్గిపెట్టి పట్రారా” అన్నారు అప్పల్నాయుడుగారు అరుగుమీద పడక కుర్చీలో కూర్చుని చుట్టతీసి నోట్లో పెట్టుకున్న పిమ్మట.

పోలిపిల్లి తలపాగాలోంచి అగ్గిపెట్టి తీసి, వెలిగించి ఆయన చుట్టకి నిప్పు అందించాడు. కానీ గాలి వెయ్యడంవల్ల అగ్గిపుల్ల ఆరిపోయింది. మరో అగ్గిపుల్ల గీశాడు. అదీ ఆరిపోయింది.

“గాలిలో దీపం వెల్గించి అటో చెయ్యి. ఇటో చెయ్యి పెడితే ఆరిపోకుండా అలాగే వుండడానికి ఇదేమైనా ఎల్. ఐ. సి దీపం ఏమిట్రా వెధవా! ఆ అగ్గిపెట్టి ఇలా ఇయ్యి” అని ఆయనే స్వయంగా అగ్గిపుల్ల వెల్గించుకుని చుట్ట ముట్టించారు.

## స్వగతంబు

“ఎల్.ఐ.సి. దీపం ఏటి బాబూ” అని అమాయకంగా అడిగాడు పోలిపిల్లి.

“జీవితం అనే దీపం ఎప్పుడు ఆరిపోద్దో ఎవరికీ తెలవదు. అయినా దీపాన్ని గాలిలో వదిలెయ్యం కాబట్టి అటో చెయ్యి. ఇటో చెయ్యి పెట్టి చూస్తాం. దాని కోసం మీరు డబ్బు కడితే మీ దీపం ఆరిపోతే మేం డబ్బు యిస్తామని చెప్పి బతికున్న వాళ్ళు కట్టిన డబ్బుని సదరు చచ్చిపోయినవాళ్ళ బతికున్న దగ్గరవాళ్ళకి ఇచ్చే ఏర్పాటుని జీవిత భీమా అంటారు. దాన్ని ఇంగ్లీషులో లైఫ్ ఇన్సూరెన్సు అంటారు.” అన్నారు అప్పల్నాయుడుగారు.

“ఏటి బాబూ! వైఫ్ ఇన్సూరెన్సేనా” అనడిగాడు పోలిపిల్లి.

“వైఫ్ కాదు లైఫ్! అంటే జీవితం. జీవితానికే భీమాకాని పెళ్ళానికి భీమా ఎవ్వరూ ఇవ్వలేరు” అని అప్పల్నాయుడుగారు చుట్ట తుదముట్టించడం కొనసాగించారు.

“దీనికీ, తమరు చుట్ట ఎలిగించిన అగ్గిపుల్లకి సంబంధం ఏటి బాబూ” అనడిగాడు పోలిపిల్లి.

“ఎల్. ఇ. సి. వాళ్ళు అంటే మన దగ్గర డబ్బు తీసుకుని మన జీవితానికి భీమా ఇచ్చేవాళ్లు గాలిలో దీపం పెట్టి అటూ, ఇటూ చేతులెట్టిన గుర్తు పెట్టుకున్నారు. అర్ధమైందా?” అన్నారు అప్పల్నాయుడుగారు చికాగ్గా!

“అదీ అలా చెప్పండి బాబూ! ఒక దీపం, రెండు హస్తాల గుర్తన్నమాట!” అన్నాడు పోలిపిల్లి అమాయకంగా.

“అబ్బబ్బ! ఈ జీవిత భీమా అంటే నీకు ఈ జీవితంలో అర్ధం కాదు. నా ప్రాణం తియ్యక నీ అగ్గిపెట్టి పట్టుకుపో” అని కోప్పడ్డాడు అప్పల్నాయుడుగారు.

వీధిలో జట్కా ఆగింది. జట్కా తోలుకుంటూ వచ్చిన భీమశంకరం గార్ని చూసి అప్పల్నాయుడుగార్కి మరింత చికాకు వచ్చింది.

“ఇవాళ నక్కని తొక్కి వచ్చాను నాయుడుగారు. నేను తొమ్మిదిసార్లు వచ్చాను తమ కోసం. తమరు పదిసార్లు దొరకలేదు. ఇన్నాళ్ళికి నా అదృష్టం



పండింది. ఇంట్లో తీరిగ్గా దొరికారు” అని భీమశంకరంగారు వచ్చి అప్పల్నాయుడు గారి వాళ్ళో కూర్చున్నారు.

“అవును నీకు ఇవాళ దొరికిపోయాను కానీ. ముందు వాళ్ళోంచి లేవ్వయ్యా బాబూ!” అని అప్పల్నాయుడుగారు జాలిగా బతిమాలుకున్నారు.

“నేను లేస్తే మీరు లేచి చక్కాపోతారు. ఇన్నాళ్ళకి దొరికారు. కనీసం పదివేలకి మరో పోలసీ తీసుకుంటేగాని నేను వదల్ను” అన్నారు భీమశంకరంగారు అప్పల్నాయుడుగారి ఒళ్ళో కూర్చునే.

చుట్టతో చురుక్కు మనిపిస్తేనేగాని భీమశంకరంగారు లేవలేదు. పోలిపిల్లి వచ్చి భీమశంకరంగార్ని పట్టుకుని మరో కుర్చీలో కూర్చోపెట్టేశాడు.

“అవునుగాని భీమశంకరం నువ్వింకా ఎల్. ఐ. సి. ఏజంటుగానే వున్నావా?” అనడిగారు అప్పల్నాయుడుగారు చుట్ట పొగ చుట్టలు చుట్టలుగా వదుల్తూ.

“నేను వున్నంతకాలం ఏజెంటుగానే వుంటాను. అయినా తమకి ఆ సందేహం ఎందుకొచ్చింది” అనడిగారు భీమశంకరం.

“ఏంలేదు. నువ్వే జట్కా తోలుకుంటూ వస్తే ఏజెంటు పని కంటే ఇదే బావుంది అనుకుని....” అని పొగతోకలిపి ఏదో అన్నారు. పొగలో ఆ మాటలు కన్పించలేదు. భీమశంకరంకి వినిపించలేదు.

“అది కేవలం జట్కాకాదు అప్పల్నాయుడు గారూ! ఒక్కసారి వీధిలోకి వచ్చి చూడండి. జీవితభీమా రథం ఇది. ఈ గుర్రం శక్తికి నిదర్శనం. దీనికి సారథి ఏజంటు.” అని జట్కాని వర్ణించసాగారు భీమశంకరంగారు.

“అందుకే నిన్ను జీవిత భీమాశంకరం అన్నారు. అది సరేగాని, మేడమెట్లలా ఈ మెట్లేమిటి?” అని ఆశ్చర్యపోయారు. అప్పల్నాయుడుగారు దేవుడి రథంలా తమాషాగావుండి గేలరీలా ఆరు అంతస్థులతో వున్న ఆ రథాన్ని చూసి:

“కిందమెట్టుమీద ఈ బండిని తోలుతోన్న ఏజంటుని రెండో మెట్టుమీద డెవలెప్‌మెంట్ ఆఫీసర్ తోలుతూ వుంటాడు. అతన్ని మూడో మెట్టుమీద వున్న అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ తోలతాడు. అతన్ని నాలుగో మెట్టుమీదవున్న బ్రాంచి మేనేజర్. అతన్ని ఐదోమెట్టుమీద వున్న అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్. అతన్ని ఆరోమెట్టుమీదవున్న డివిజనల్ మేనేజరూ తొందరతొందరగా తోలుతూ వుంటారు” అని జీవిత భీమా శంకరం టూకీగా వివరించారు.

“మిమ్మల్ని మోస్తూ తొందరగా మీ గమ్యానికి మిమ్మల్ని చేర్చే గుర్రం ఎవరంటావు మరి? అని” అడిగారు అప్పల్నాయుడుగారు.

“మీరే! అంటే తమలాంటి పోలసీ హోల్డర్లే! తమరు కొంచెం కోపంగా వున్నట్టున్నారు. వచ్చేవారం కలుస్తాను” అని జీవిత భీమా శంకరం జట్కా తోలుకుంటూ తోలించుకుంటూ వెళ్ళిపోయాడు.

— తంబు

